మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# నెలాఖరులోగా సీఎంఆర్ డెలివరీ చేయాలి..

**43 మిల్లుల యజమానులతో సమీక్ష..రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు**



సమీక్షలో మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 12 ప్రభాతవార్త:** ఈ నెలాఖరు నాటికి నూటికి నూరుశాతం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) డెలివరీ చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు అన్నారు. మంగళవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని ఎన్‌ఐసి సమావేశ మందిరంలో పౌర సరఫరాలు, భారత ఆహార సంస్థ అధికారులు, రైస్ మిల్లర్లతో ఈ సంవత్సరానికి సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌పై సమీక్ష నిర్వహించారు. మిల్లుల వారిగా డిసెంబర్ 31 నాటికి నిర్ణయించిన మేరకు సీఎంఆర్ చెల్లింపుపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని సుమారు 43 రైస్‌మిల్లులు అత్యధికంగా సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న వాటిగా గుర్తించి ఆ మిల్లుల యాజమాన్యంతో సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం సీఎంఆర్ డెలివరీ చేయాలని మిల్లర్లతో కోరారు. పౌరసరఫరా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రతిరోజు సిఎంఆర్‌ను పర్యవేక్షించాలని ఆదేశించారు. రైస్ మిల్లర్లు టార్గెట్ ప్రకారం సిఎంఆర్ చెల్లించేందుకు అవసరమైన స్థలాన్ని వారికి అందుబాటులో ఉంచాలని, అదేవిధంగా హమాలీల సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ప్రవీణ్, డిఎస్‌ఓ శ్రీనివాస్, ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్‌ఇండియా ఏజిఎం, డిపో మేనేజర్ అస్లాం, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, రైస్ మిల్లర్లు సమావేశానికి హాజరయ్యారు.

# జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో 100 శాతం హాజరు పెంచాలి: జిల్లా కలెక్టర్



**గద్వాల ప్రతినిధి డిసెంబర్ 12 ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో 100 శాతం హాజరు పెంచాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి విద్యాశాఖాధికారులకు ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్సు హాలు నందు జిల్లాలోని గురుకులు, మైనార్టీ, సాంఘీక సంక్షేమం, విద్యాశాఖ అధికారులతో విద్యపై వార్షిక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూ డైస్ ప్లస్‌లో ప్రతి విద్యార్థి ప్రొఫైల్ తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు. ఆధార్ లేని విద్యార్థుల చదువు బ్రేక్ అప్ కాకుండా చూడాలన్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు టీసీ, బోనాఫైడ్ ఇచ్చే విషయంలో ఇబ్బంది పెట్టకుండా చూసుకోవాలని డీఈఓకు ఆదేశించారు. జిల్లాలో విద్యార్థులు బడి బయట తిరగకుండా పాఠశాలలో చేరే విధంగా ప్రోత్సాహించాలని అన్నారు. వివిధ ప్రభుత్వ, ప్రాథమిక ఉన్నత, రెసిడెన్సియల్ పాఠశాలలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో విద్యార్థులకు ఉపకార వేతనాలు సకాలంలో అందించాలని అన్నారు. విద్యార్థులందరికి ఫెస్ రికగ్నైజ్ సిస్టమ్‌లో నమోదు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సిరాజుద్దీన్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి ముషాయిదా బేగం, బీసీ సాంఘీక సంక్షేమ శాఖ అధికారి శ్వేతా ప్రియదర్శిని, మైనార్టీ రెసిడెన్సియల్ అధికారి, ఎమ్ఈఓలు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# మక్తల్ విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే



**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు 12 ప్రభాతవార్త:** 5,6 తేదీలలో మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ క్రీడలలో నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణానికి చెందిన జి. జస్వంత్ (అక్షర పాఠశాల) ఎ.రంజిత్‌కు మార్,(స్కాలర్స్ జూనియర్ కళాశాల), బి.మధుప్రియ, బి.పావని (శాంతినికేతన్ పాఠశాల) జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికై, ఈ నెల 26నుండి 29వరకు బీహార్ రాష్ట్ర పాట్నాలో జరిగే జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొంటున్న క్రీడాకారులను, ఉత్తరప్రదేశ్ బుద్ధ గయాలో జరిగిన షూటింగ్ బాల్ జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న బి.మల్లేశ్వరి,(శాంతినికేతన్ పాఠశాల) విజయవాడలో జరిగిన సౌత్‌జోన్ జూనియర్స్ షూటింగ్ బాల్ క్రీడల్లో పాల్గొన్న అనిల్‌కుమార్‌ను (ప్రభుత్వ జూనియర్ కళాశాల), వెంకటేశ్‌ను (శాంతినికేతన్ పాఠశాల) ఈనెల 12న, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తన స్వగృహంలో జాతీయ స్థాయి క్రీడాకారులను ఘనంగా సన్మానించి, అభినందించినట్లు జిల్లా షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు.జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దినందుకు కృషి చేసిన విశ్రాంత పీఈటి బి.గోపాలంను, కోచ్ ఎస్.రమేష్‌కుమార్‌ను,పీ ఈటిలు ఎన్.రాఘవేందర్‌ను, సి.అంబ్రేష్‌ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అభినందించారు.కార్యక్రమంలో నేరెడుగామ్ సర్పంచ్ జి. అశోక్ గౌడ్, అడ్వకేట్ దత్తాత్రేయ, నాగరాజు, ఓబులేష్, అయ్యప్ప, నర్సింలు స్వామి పాల్గొన్నారు.

# రైతులకు సాగునీరు విడుదల చేయండి..

**మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన దేవరకద్ర,నారాయణపేట ఎమ్మెల్యేలు**



**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు 12 ప్రభాతవార్త:** దేవరకద్ర, నారాయణపేట నియోజకవర్గ పరిధిలో గల కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పరిధిలో సాగు చేసుకుంటున్న రైతులకు రబి సీజన్‌లో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ద్వారా రైతులకు సరిపడా సాగునీరును వెంటనే విడుదల చేయాలని నారాయణపేట, దేవరకద్ర ఎమ్మెల్యేలు డా.చిట్టెం పర్ణి కారెడ్డి, జి.మదుసూదన్‌రెడ్డిలు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రవిని కోరారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పరిధిలో సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న రైతుల ఇక్కట్లను గుర్తించి మంగళవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రవితో భేటీ అయ్యారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పరిధిలో వ్యవసాయం చేసుకుంటున్న రైతుల కష్టాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రాజెక్టు పరిధిలోని రైతులు సాగునీరు లేక ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చాలని కలెక్టర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వీలైనంత త్వరలో రైతులకు కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ద్వార సాగునీరు అందిస్తామని, కోయిల్‌సాగర్ ద్వారా సరిపడా సాగునీరు రైతులకు అందకపోతే, అవసరమైతే జూరాల బ్యాక్‌వాటర్ ద్వారా సాగునీరు అం దిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు నూతన ఎమ్మెల్యేలుగా ఎన్నికైన జి.మధుసూదన్‌రెడ్డి డా.చిట్టెం పర్ణికరెడ్డిలకు పూలమొక్కలు అందించి జిల్లా కలెక్టర్ ఘన స్వాగతం పలికారు.

# కాంగ్రెస్‌తోనే ప్రజారంజక పాలన..

**ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తాం**

**ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతా: ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి**



**చిన్నచింతకుంట,డిసెంబరు 12 ప్రభాతవార్త:** కాంగ్రెస్‌తోనే బడుగు, బలహీన వర్గాలకు ప్రజా రంజక పాలనను అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శ్రీ కురుమూర్తి స్వామి దర్శించుకున్న అనంతరం దేవస్థాన ఈఓ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తామన్నారు. అధికారం చేపట్టిన రెండు రోజుల్లోనే రెండు పథకాలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల వరకు కార్పోరేట్ వైద్యం అందించే పథకానికి అమలు చేశామని ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుబంధు కూడా అమలు చేస్తున్నారని తెలిపారు. మిగతా పథకాలను కూడా 100 రోజులలో అమలు చేస్తామని ఆయన తెలిపారు. బిఆర్ఎస్ అస్తవ్యస్త పాలనను సరిచేసే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ తీసుకుందని ఆయన తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు అంచనాలు మాత్రమే నీటి పారుదల శాఖ అధికారులు సూచించారు తప్ప ప్రాజెక్టు కాలువల భూసేకణ ఇప్పటివరకు జరగలేదని అధికారులు తెలిపారన్నారు. గుడ్‌మార్నింగ్ దేవరకద్ర పేరిట వారంలో నాలుగు రోజులపాటు ఆయా గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి అధికారుల సహకారంతో అక్కడనే పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో పాటు, నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. మా ఇంటి ఇలవేల్పు శ్రీ కురుమూర్తిస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. జాతర మైదానంలో పరిశుభ్రతకు అండర్ డ్రైనేజీ వ్యవస్థ తీసుకొస్తామన్నారు. దేవస్థానంలోని సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మొత్తం వాళ్లే చేశారు..?



- చర్లకోల లక్ష్మారెడ్డి ఓటమిపై కొనసాగుతున్న చర్చ
- చైర్‌పర్సన్ భర్త, ముగ్గురు కౌన్సిలర్లే కారణమా..?
- చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్లపై అవిశ్వాసం..?
- సోషల్ మీడియాలో కొనసాగుతున్న వార్
- సౌమ్యుడు, మనసున్న నేతను ఓడించారంటూ ఫైర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** జడ్చర్ల నియోజకవర్గంలో సోషల్‌మీడియా వేదికగా వారం రోజులుగా ఒకటే చర్చ కొనసాగుతున్నది. ఎన్నికల ఫలితాలు వెలువడ్డ రోజు నుంచే ఆ చర్చకు దారితీసింది. అదీ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఓటమి విషయంపై. మీరే చేశారంటే మీరే చేశారంటూ ఒకరి ఒకరిపై బురద చల్లుకునే ప్రయత్నం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో నాయకులు పని చేయకపోవడం, ప్రజలకు ఏం చేస్తామో చెప్పలేకపోవడం, వ్యతిరేఖతను తిప్పికొట్టకపోవడం, చాలా వరకు నేతల మధ్య సమన్వయ లోపం, గెలుస్తామనే నాయకుల ఓవర్ కాన్ఫిడెన్స్ కొంపముంచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రధానంగా మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, ఇద్దరు,ముగ్గురు కౌన్సిలర్లు కలిసి మున్సిపాలిటీ భూములు, ప్లాట్ల విషయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలే ప్రధాన కారణంగా తెలుస్తున్నది. దీంతో ఎన్నికల రిజల్ట్ వెలువడ్డప్పటినుంచి మీరే చేశారంటే మీరే చేశారంటూ ఒకరిపై ఒకరు తప్పును తోసుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అయితే అక్కడక్కడ కొన్ని సమస్యలున్నా వాటిపై దృష్టి సారించలేదనే ఆరోపణలూ ఉన్నాయి.

**రేపో,మాపో అవిశ్వాసం..!**

అయితే చైర్‌పర్సన్‌భర్త, కొందరు కౌన్సిలర్లు కలిసి చేసిన అవినీతి అక్రమాలకు కౌన్సిలర్లే చేశారనే నింద పడుతుందని దాన్ని తాము సహించలేమంటూ ప్రధానంగా కొందరు కౌన్సిలర్లు కలిసి సమావేశమై ఈ చర్చకు తెరలేపినట్లు సమాచారం. అయితే లక్ష్మారెడ్డి ఓటమికి కూడా ప్రధానంగా వాళ్లే కారణమని, పట్టణంలోని బాహాలంగానే చర్చించుకున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయాలన్నీ ఎన్నికలకు ముందే అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి కొందరు తీసుకెళ్లినా అప్పటికే పరిస్థితులు చేయిదాటిపోవడంతో ఆయన కూడా ఏం చేయలేకోపోయారని ఓ కౌన్సిలర్ తన ఆవేదన వ్యక్తం చేశాడు. మున్సిపల్ పాలకమండలిలో చోటు చేసుకున్న పరిణామాలే ప్రధానంగా పట్టణంలో బీఆర్ఎస్ ఓటింగ్ శాతం కోల్పోవడానికి కారణంగా తెలుస్తున్నది. ఓ నాయకుడు, కొందరు కౌన్సిలర్లు చేసిన తప్పిదాలకు మనసున్న నేతను కోల్పోయామంటూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తుండడం గమనార్హం. కొందరు బీఆర్ఎస్ నాయకులు వారిపై బూతులు కూడా తిడుతూ చేస్తున్న పోస్టులు లోకల్ గ్రూపుల్లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా చైర్‌పర్సన్‌ను మారిస్తేనే నిజాయితీగా ఉన్న కౌన్సిలర్లపై అవినీతి మచ్చ పోతుందని భావించారు. ఈక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్‌పర్సన్‌లపై అవిశ్వాసానికి పులువరు కౌన్సిలర్లు నిర్ణయించుకున్నట్లు తెలుస్తున్నది. కొందరు కౌన్సిలర్లు గత రెండు, మూడు రోజులుగా సమావేశమై ఇదే విషయం చర్చిస్తున్నట్లు సమాచారం. అయితే చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌గా ఎవరినీ నియమిస్తే బాగుంటుందనే విషయమై కూడా చర్చించినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారం అంతా మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లిన అనంతరమే ఏదైనా నిర్ణయం ఫైనల్ అవుతుందని, ఈ రెండ్రోజుల్లో ఏదో ఒకటి తేలిపోతుందంటూ ఓ కౌన్సిలర్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఏదిఏమైనా అభివృద్ధి మాటున కొందరు అక్రమాలు, అరాచకాలే లక్ష్మారెడ్డి ఓటమికి కారణమైనట్లు స్థానికులు సైతం చర్చించుకుంటున్నారు.

# కబ్జాదారులను వదిలిపెట్టం..!

**ప్రభుత్వ స్థలాలను గుర్తించి కాపాడతాం:ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు12 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ భూములను కబ్జా చేసిన భూభకాసురులను కబ్జా కోరులను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేది లేదని చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలో భూ ఆక్రమణలపై చర్యలు తీసుకుని భూములను కాపాడాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జి.రవినాయక్‌ను కోరారు. అనంతరం కలెక్టర్ ఆవరణలో యెన్నం విలేఖరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని గుర్తించి అందుకు కారణమైన వారిని శిక్షించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరామని తెలిపారు. ఫోర్జరీ పట్టాలు సృష్టించి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను విడిపించి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా చేయడమే లక్ష్యంగా తాను పని చేస్తానని తెలిపారు. తన హయాంలో ప్రభుత్వం పరిధిలోకి వచ్చేది ఏదైనా ఏ ఒక్కరికో ఇద్దరికో ఒక కుటుంబానికి లాభం కలిగించే విధంగా పనిచేయడం జరగదని అందుకు తమ ప్రభుత్వం కూడా సహకరించదని వెల్లడించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కూడా స్పందించి ఆర్డీఓ, తహసిల్దార్లకు ఆదేశాలు జారీ చేశారని ఇంకా ఏవైనా గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి ఆరోపణలు, కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలు ప్రజలు గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే అందుకు కారకులైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకూడదనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 2014 నుంచి ఇప్పటిదాకా పట్టణంలోని ఓపెన్ భూములను రీ వెరిఫై చేసి కబ్జాకు గురైతే తిరిగి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సిజె బెనహర్ తదితరులు ఉన్నారు.

# సివిల్ సప్లయ్ శాఖ పై మంత్రి సీరియస్..

**జిల్లా ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం**



మంత్రిని సన్మానిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి డిసెంబర్ 12 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన ప్రగతి పై అబ్కారి, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా మంత్రి జూపల్లి కృష్ణారావుకి పోలీస్ ఆధ్వర్యంలో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ఐడిఓసిలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు శాఖలో గత ప్రభుత్వంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ప్రభుత్వం నుంచి ఎంత నిధులు వచ్చాయి? ఎంత ఖర్చు పెట్టారు? ఇంకా మిగిలిన పనులు ఎంత పెండింగు ఉన్నాయి. ఆయన అధికారులను ఆడిగి తెలుసుకున్నారు. సివిల్ సప్లై శాఖపై జిల్లా అధికారిని మంత్రి జిల్లాలో రైస్ మిల్లులకు ఎన్ని క్వింటాల వడ్లు ఇచ్చారు. ఎంత బియ్యం ఇవ్వని రైసు మిల్లులపై కేసులు నమోదు చేశారా? అని మంత్రి జిల్లా అధికారినిని అడిగారు. ఇరిగేషన్ శాఖపై జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై జిల్లా అధికారిని అడిగి వివరాలు తీసుకున్నారు. అలాగే అబ్కారి శాఖపై సొసైటీలు ఉన్నాయి. కల్లు మద్యం రసాయనలు కలిపి అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేశారా? అంటూ జిల్లా అధికారిని మంత్రి ప్రశ్నించారు. అలాగే జిల్లాలో గుడుంబాను అరికట్టడంలోను ఏ చర్యలు తీసుకున్నారు. మంత్రి అడిగారు. ఇరిగేషన్ , వైద్యం, అబ్కారి, సివిల్ సప్లై, టూరిజం, పంచాయితీ రాజ్ సంబంధించిన శాఖలపై మాత్రమే మంత్రి జూపల్లి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జడ్పీ చైర్ పర్సన్ సరిత, ఎమ్మెల్యేలు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చాలా వెంకటరామిరెడ్డి, అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహన్, చీర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



గౌరవవందనం స్వీకరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



సమీక్షలో పాల్గొన్న అధికారులు

# జర్నలిస్టులు ఐక్యంగా ఉండాలి..

**కలెక్టర్‌తో చర్చించి సమస్యలు పరిష్కరిస్తాం**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**



ఎమ్మెల్యేను కలిసిన జర్నలిస్టులు

**మహబూబ్‌నగర్‌బ్యూరో,డిసెంబరు12 ప్రభాతవార్త:**జర్నలిస్టులంతా ఐక్యంగా కలిసి ఉంటే సమస్యల పరిష్కారం సులభంగా అవుతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ యూనియన్లకు చెందిన సీనియర్ జర్నలిస్టులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టుల సమస్యలపై ఎమ్మెల్యేతో చర్చించారు. జర్నలిస్టుల ఇండ్లు, ప్లాట్ల సమస్యలకు సంబంధించి కలెక్టర్‌తో చర్చిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అందరికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. సమస్యలపై నిర్భయంగా పోరాడాలని, నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని నిజాలను వాస్తవాలను నిర్భయంగా ప్రజలకు చెప్పాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డికి జర్నలిస్టులు బొకే అందజేశారు. వివిధ పత్రికల సీనియర్ జర్నలిస్టులు దండు దతేందర్, బిజీ రామాంజనేయులు, బండి విజయకుమార్, యాదగిరి, నరసింహ, ప్రభాకర్, వెంకటేష్, ఎన్. సతీష్‌రెడ్డి,ఖాజా మొయినుద్దీన్ ఉన్నారు.

# పల్లకి సేవలో పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి



పల్లకి సేవలో పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వనపర్తి,డిసెంబర్ 12,ప్రభాతవార్త :** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంగళవారం వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామ శివారులోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పల్లకి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.కార్తీక మాసం సందర్భంగా గ్రామస్తులు చేపట్టిన ఈ పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్నారు.అనంతరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిచ్చారెడ్డి,మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్,గ్రామస్తులు నరేందర్ రెడ్డి,వెంకటయ్య,ఆలయ అర్చకులు గ్రామస్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వ్యక్తి అదృశ్య ఫిర్యాదుతో బయటపడిన హత్య ఉదంతాలు...

- భూములు, డబ్బులే లక్ష్యంగా వరుస హత్యలు...
- హత్యలకు ముందే తన పేరిట ఆస్తుల మార్పిడి...
- 11 హత్యలు చేసినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్న నిందితుడు సత్యనారాయణ
- కోర్టు అనుమతితో పోలీస్ కస్టడీకి తీసుకొని మరోసారి విచారిస్తాం...
- జోగులాంబ గద్వాల్ జోన్ డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్

4లో

## ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



**ఉట్కూర్,డిసెంబరు12 ప్రభాతవార్త:**ఉట్కూర్ మండలకేంద్రంలోని అయ్యప్ప సన్నిధి దగ్గర అయ్యప్పస్వామి పూజా కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి సుమలత అధ్యక్షతన రఘు గురుస్వామి, భగవంతు గురుస్వామి, వెంకట్‌గురుస్వామి, భానుచందర్ గురుస్వామి, రాముగౌడ్ గురుస్వామి, బాలాంజనేయులు, కె.గోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, హాజరై అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి సుమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఎంపిటిసి దొబ్బలి హనుమంతు, గొల్ల విజ యకుమార్, బసిరెడ్డి శ్రీను, సందీప్, రమేష్‌లు హాజరై పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

### ఈనెల 15న పాలమూరు విశ్వవిద్యాలయ

## సౌత్‌జోన్ హాకీ పురుషుల జట్టుకు ఎంపికలు

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 12 ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన పాలమూరు విశ్వవిద్యాలయ సౌత్‌జోన్ పోటీలకు హాకీ పురుషుల జట్టుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల వనపర్తిలో ఉదయం 10 గం.లకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పాలమూరు విశ్వవిద్యాలయ వ్యాయామ ఉపాధ్యాయుడు డా. వై.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు పాలమూరు విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న డిగ్రీ, పిజి కళాశాలల నుండి ఉత్తమ 5 మంది క్రీడాకారులు కళాశాల బోనఫైడ్ మరియు ఆధార్‌లతో హాజరు కావాలని ఆకాంక్షించారు. పాలమూరు విశ్వవిద్యాలయ హాకీ పురుషుల జట్టుకు ఎంపికైన క్రీడాకారులు భారతి దాసన్ విశ్వవిద్యాలయ తమిళనాడులో జరిగే జాతీయస్థాయి సౌత్‌జోన్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 8074262189 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## రాష్ట్ర స్థాయిలో బహుమతి సాధించిన గురుకుల విద్యార్థి



**కొత్తకోట,డిసెంబర్ 12,ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణ కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఎంపీపీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని లక్ష్మి అండర్ 19 విభాగంలో చెస్ క్రీడలో రాష్ట్రస్థాయి లో ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాలతి పిఈటీ ఉపాధ్యాయులు రాజేశ్వరి, భారతి లకు అభిరందనలు తెలిపారు. లక్ష్మి మునుముందు చధరంగంలో మంచి ప్రావీణ్యత సంపాదించాలి అని ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా చాలా అవసరమని చెప్పారు. విద్యార్థులు ఏ రంగంలో ఆసక్తి కనపరుస్తారో దానిని మనం ప్రోత్సహించాలని అన్నారు. మా గురుకుల విద్యార్థులు ఆయా క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపడం సంతోషంగా ఉందన్నారు.

## బాధితకుటుంబానికి ఆర్థిక సహాయం

**కొత్తకోట,డిసెంబర్ 12,ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణం ఎస్సీ కాలనీకి చెందిన పులిజాల లక్ష్మయ్య (65) గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న జె.ఎస్.రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల (శవ పేటిక )నిమిత్తం రెండు వేల ఐదు వందల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జెఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు జె.సతీష్ రాజు, మాజీ వార్డు సభ్యులు సుభాష్, ప్రేమ దానం, రిపోర్టర్ రమేష్, పౌలు, శ్యాంసుం దర్, కృష్ణయ్య, షిమీ యాసోన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే జీఎంఆర్‌కు సంగీభవం తెలిపిన నాయకులు



**కొత్తకోట,డిసెంబర్ 12,ప్రభాతవార్త :** దేవంకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మంగళవారం చిన్నచింతకుంట మండలం దామగ్నపురం గ్రామం నుండి కురుమూర్తి దేవస్థానం వరకు పాదయాత్ర చేపట్టారు. అందులో భాగంగా కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిచుపల్లి, గొల్లబాబు తన నాయకులతో కలిసి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పాదయాత్ర కు సంఘీభావం తెలిపేందుకు కొత్తకోట నుండి పాదయాత్రగా బయలుదేరారు. దేవరకద్రలో పెద్దఎత్తున మార్పు జరిగిందని అందరూ ఇందిరమ్మరాజ్యం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అందుకు ఆ కురుమూర్తి స్వామి ఆశీసులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిపై ఉండాలని కోరుతూ దేవస్థానం వరకు పాదయాత్ర చేస్తున్నామని బిచుపల్లి తెలిపారు. కొత్తకోట మండల కాంగ్రెస్ నాయకులు జీఎంఆర్ పాదయాత్ర పాల్గొన్నారు.

## పంప్‌హౌస్ నుండి నీటిని విడుదల చేసిన డిఈ

**మక్తల్ రూరల్,డిసెంబరు 12 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మక్తల్ మండలం చిన్న గోప్లపూర్ పంప్ హౌస్ నుండి సంగంబండ నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారు. రైతుల రబీపంట కొరకు నారుమళ్లు పోసుకుని నాటు కొరకు సిద్ధంగా ఉన్నారు. నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ డ్యాములో నీళ్లు లేకపోవడం వల్ల రైతులు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కోరగా వెంటనే స్పందించి ఇరిగేషన్ డిఈతో చరవాణి ద్వారా మాట్లాడి నీటిని విడుదల చేయించారు. నీటి విడుదలను చూసి రైతులు ఎంతో సంతోషపడ్డారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి లక్ష్మారెడ్డి, గవినోళ్ల గోపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ ఛైర్మన్ రవికుమార్ యాదవ్, కావలి శ్రీహరి, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్‌గుప్తా పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డిని సన్మానించిన నాయకులు

**కల్వకుర్తిరూరల్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:**నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం తిమ్మరాశిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కల్వకుర్తి ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి పరుస్తానన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో గోరెంట్ల సిరియల్ యాదవ్, చిమ్ముల వెంకట్‌రెడ్డి, ఇసరి సత్యనారాయణరెడ్డి, సుద్దకంటి శేఖర్, గడ్డం పాండు, బర్రె జంగయ్య, వెంకటయ్య, అశోక్‌రెడ్డి, పానుగంటి శేఖర్, శ్రీను, మల్లేష్, కృష్ణయ్య, మాధవులు, సత్యంరెడ్డి, మహేష్, జంగయ్య, చంద్రయ్య, రామచంద్రం, అచ్చలు, అంజయ్య, రవి తదితరులు ఉన్నారు.



## క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ బహుకరణ

**కల్వకుర్తి, డిసెంబర్ 12 ప్రభాతవార్త:**క్లాస్‌మెట్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ గుండూర్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల స్టడీ మెటీరీయల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, ప్రసన్న రమేష్, విజయభాస్కర్ల చేతుల మీదుగా అందించారు. దాతలు చిదిరే ప్రసన్న రమేష్ కుమారుడు రక్షిత వర్షిత్ జన్మదినాన్ని పురస్కరించుకొని, విజయ్‌భాస్కర్ కుమార్తె పెళ్లి రోజును పురస్కరించుకొని స్టడీ మెటీరీయల్స్‌ను సమకూర్చినట్లు క్లాస్‌మెట్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులు బాదం రాఘవేందర్ తెలిపారు. జూలూరి రమేష్‌బాబు వారి సతిమణి రాజేశ్వరి జన్మదినాన్ని పురస్కరించుకొని అందించిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఎంబీబీఎస్ విద్యార్థికి క్లాస్‌మెట్ క్లబ్ తరుపున అందించినట్లు క్లబ్ అధ్యక్షులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు లక్ష్మి నరసింహరావు, సభ్యులు విజయభాస్కర్, ప్రశాంత్, సత్యనారాయణ, జీహెచ్ఎం వెంకటయ్య, మాజీ సర్పంచ్ పర్వత్‌రెడ్డి, సీఆర్పీ విజయ్ భాస్కర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



# శ్రీ కురుమూర్తి ఆలయ అభివృద్ధికి కృషి..

### స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలి.. పాదయాత్రగా వెళ్లి స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు..



పాదయాత్రగా స్వామివారి దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న అర్చకులు



ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

**చిన్నచింతకుంట,డిసెంబరు 12 ప్రభాతవార్త:** పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా కొలువబడుతూ, మా ఇంటి ఇలవేల్పు శ్రీ కురుమూర్తి స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన స్వామివారికి మొక్కు చెల్లింపులో భాగంగా మంగళవారం తనసొంత గ్రామమైన దమగ్నాపూర్ నుంచి పాదయాత్రగా బయలుదేరి పెద్ద వడ్డెమాన్, చిన్న వడ్డెమాన్, ఏదులాపూర్, చిన్నచింతకుంట గ్రామాల మీదుగా పాదయాత్ర జరిగింది. ఈ పాదయాత్రలో పార్టీ శ్రేణులను కలుస్తూ, ప్రజలకు అభివాదం చేస్తూ పాదయాత్ర కొనసాగింది. అడుగడుగునా పార్టీ శ్రేణులు బాణాసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ పాదయాత్ర శ్రీ కురుమూర్తి దేవస్థానం చేరుకోగానే ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి స్వాగతం పలుకుతూ కొండపైకి తీసుకెళ్లారు. కొండపై గల ముఖద్వారం వద్దకు చేరుకోగానే ఆలయ మర్యాదలలో భాగంగా మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అక్కడినుంచి స్వామివారి సన్నిధిలో శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారి చరిత్ర వివరించి ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో జిల్లా, నియోజకవర్గ ప్రజలు సంతోషంగా జీవించాలని కోరినట్లు తెలిపారు. మా ఇంటి ఇలవేల్పు కురుమన్న సాక్షిగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అరవింద్‌కుమార్‌రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, మండల అధ్యక్షులు నరెందర్‌రెడ్డి, విండో ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ఎంపిటిసి స్వప్న శివకుమార్, దామోదర్, కో ఆప్షన్ మహ్మద్, యూత్ మండల అధ్యక్షులు వెంకటేష్, జైపాల్‌రెడ్డి, ప్రతాప్, జాకీర్, ఎద్దుల మధుసూదన్‌రెడ్డి, ధనుంజయ, గూడూర్ శేఖర్, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళితే ప్రాణం తీస్తారా..

### బి.ఆర్.యస్ గిరిజన నాయకులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ గిరిజనులు సంఘము నాయకులు

**వనపర్తి ,డిసెంబర్ 12,ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఒక గిరిజనుడిని లాకప్ డెత్ కావడాన్ని బి.ఆర్.యస్. తీవ్రంగా ఖండిస్తుంది. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంత్రి.నిరంజన్ రెడ్డి నివాస గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాత్రు నాయక్ మాట్లాడుతూ నల్గొండ జిల్లా పోలేపల్లి పరిధి పాలెం తాండకు చెందిన అన్నదమ్ముల మధ్య భూవివాదం ఉందనీ, ఇట్టి భూ వివాదంలో పోలీస్ స్టేషన్ వరకు వెళ్ళడం జరిగిందన్నారు. ఈ వివాదంలో ఇరువర్గాలను కూర్చోబెట్టి న్యాయం చేయాల్సిన ఎస్.ఐ సతీశ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పెద్దల ఒత్తిడి వల్ల సూర్య నాయక్ అనే వ్యక్తిని అకారణంగా కొట్టడం వల్ల అతను దెబ్బలకు తట్టుకోలేక, మానసిక ఒత్తిడికి గురై మరణించడం జరిగిందన్నారు. ఒక గిరిజన వ్యక్తి మరణానికి కారణమైన ఎస్.ఐను ఉద్యోగం నుండి డిస్మిస్ చేసి అతని పై ఎస్.సి,ఎస్.టి కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బి.ఆర్.ఎస్ గిరిజన సంఘం డిమాండ్ చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏ చిన్న సంఘటన జరిగినా గగ్గోలు పెట్టే కాంగ్రెస్ నాయకులు ఏకంగా ఒక గిరిజనుడు లాకప్ డెత్ చేస్తే కేవలం సస్పెండ్ చేసి చేతులు దులుపు కావడాన్ని బి.ఆర్.యస్ ఖండిస్తుందని మండిపడ్డారు. చనిపోయిన సూర్యా నాయక్ కుటుంబానికి 50 లక్షల ఆర్థిక సహాయంతో పాటు 5 ఏకారాలు భూమితో పాటు కుటుంబములో ఒకరికి ఉద్యోగం కలిపించాలని, రాబోయే కాలంలో ఇలాంటి దాడులు జరగకుండా చర్యతు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ పత్రికా సమావేశంలో జాత్రు నాయక్, గోపాల్ నాయక్, శ్రీను సర్పంచ్, మురళి సర్పంచ్, గౌడ్ నాయక్ సర్పంచ్, రమేష్ మాజీ కౌన్సిలర్, శంకర్, బాబు నాయక్, గోవిందు పాల్గొన్నారు.

## రాజీవ్ ఆరోగ్యశ్రీ మంది పైసలతో మంగళహారతులు పట్టినట్లు ఉంది

### కాంగ్రెస్ పార్టీకి ప్రచారం మీద ఉన్న ధ్యాస ప్రజాసేవమీద లేదు

### మీడియా సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్

**వనపర్తి,డిసెంబర్ 12,ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం మంది పైసలతో మంగళహారతులు పట్టినట్లు ఉందని బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్ ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆర్భాటంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలలో రాజీవ్ ఆరోగ్య శ్రీ అనేది కొత్త సీసాలో పాత సారా అనే సామెతను తలపిస్తుందని విమర్శించారు. వనపర్తి ఎమ్మెల్యే ఆర్బాటంగా ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంలో ఏమాత్రం కొత్తదానం, స్పష్టత లేకపోవడం వల్ల కాంగ్రెస్ పార్టీకి భావిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం కేంద్ర ప్రభుత్వంలో సంబంధం లేకుండా రూ.15 లక్షలతో కూడిన ఆరోగ్య శ్రీ అందిస్తానని చెప్పారని, కానీ రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించడం విడ్డురంగా ఉందని అన్నారు. కేసీఆర్ ఆరోగ్య శ్రీ వల్లనే మన రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలకు ఎక్కువ ప్రయోజనాలున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకోకుండా నిత్యం మోది, ప్రభుత్వాన్ని విమర్శించే ప్రయత్నం చేస్తుందని, అధికారం కోసం, ప్రచారం కోసం, నిధుల కొరతను దాచి పెట్టడానికి కాంగ్రెస్ పార్టీ పాట్లు పడుతున్నదని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బి.ఆర్.యస్ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ పత్రికా సమావేశంలో మీడియా కన్వీనర్ నందిమల్ల, అశోక్, సర్పంచ్ కోట్ల.వెంకటేష్, లక్ష్మి నారాయణ, దేవర్ల నరసింహ, అగుపోగు.కుమార్, యుగంధర్ రెడ్డి, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ అధ్యక్షుడి ఉదారత్వం..!!

### - అయ్యప్పస్వాముల నిత్యాన్నదానానికి రు.51వేల ఆర్థిక సహాయం..



భూత్పూర్‌లో అయ్యప్పస్వాములకు రు.51వేల చెక్కును అందజేస్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

**భూత్పూర్,డిసెంబర్ 12,ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ కేంద్రంలో అయ్యప్పదీక్షలు చేపట్టిన 30మంది అయ్యప్పస్వాముల నిత్యాన్నదానం కోసం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉదార స్వభావంతో మంగళవారం రు.51వేల ఆర్థిక సహాయం అందించారు. గత కొన్ని రోజులుగా స్థానిక మునిరంగస్వామి ఆవరణలో దీక్షా శిబిరానేర్పాటు చేసుకుని దీక్షలు చేస్తున్నారు. అయ్యప్పస్వాముల దీక్షా శిబిరాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి స్వాముల నిత్యాన్నభిక్ష కోసం తన వంతు సహాయంగా రు.51వేల విలువ చేసే చెక్కు రూపంలో ఆర్థిక సహాయాన్ని గురుస్వాములైన వెంకటరెడ్డి, వెంకటేశ్వరావ్, మల్లేష్, బాబయ్య, బాలవర్ధన్‌రెడ్డి, రాజులకు అందజేశారు. సామాజిక సేవలో భాగంగా కఠోర నిష్టతో అయ్యప్పదీక్షలు చేపట్టిన అయ్యప్పస్వాముల నిత్యాన్నభిక్ష కోసం తన వంతు సహకారం అందించినట్లు కేసిరెడ్డి తెలపారు. ఈ కార్యక్రమంలో స్వాములతో పాటు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మందడి వెంకటనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## పలు ఆలయాల్లో పూజలు చేసిన ఎమ్మెల్యే



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పర్ణికరెడ్డి

**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు 12 ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలోని వివిధ ఆలయాల్లో మంగళవారం నారాయణపేట ఎమ్మెల్యే దంపతులు డా.చిట్టెం పర్ణికరెడ్డి, డా. విశ్వజిత్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నారాయణపేట మండల పరిధి లోని లోకపల్లి లక్ష్మమ్మ దేవాలయం, లింగంపల్లి ఎల్లమ్మ దేవతకు, తిరుమల దేవునిపల్లిలో గల వెంకటేశ్వరస్వామి దేవాలయంలో, ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఇంటి ఇలవేల్పు అయిన చిన్న రాజమూరు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నారాయణపేట పట్ట ణంలోని అమరేశ్వర దేవాలయంలో శివలింగానికి అభిషేకంతో పాటు మెట్టుగడ్డ అభయాంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిం చారు. అదేవిధంగా నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని డా. చిట్టెం పర్ణికరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుగంధమ్మ, ఎంపిటిసి శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సదాశిరెడ్డి, కోట్ల జగన్‌మోహన్‌రెడ్డి, బండి వేణుగోపాల్, కోట్ల రవిందర్‌రెడ్డి, ఎండి గౌస్, జనార్ధన్‌గౌడ్, భీమ్‌ప్రకాష్, అచల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజిరెడ్డి, వెంకటయ్య, కోళ్లనర్సింలు, నీలి రాములు, బండి గోపాల్‌రెడ్డి, బండి ఆనంద్, కురువ మనోజ్, పవన్, డిఎంహెచ్ఓ సౌభాగ్యలక్ష్మి, పంచాయతీ సెక్రెటరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జీవ, భౌతిక రసాయన సబ్జెక్టు స్థాయి కాంప్లెక్స్ సమావేశం



**లింగాల,డిసెంబరు 12 ప్రభాతవార్త:** మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జీవ, భౌతిక, రసాయన శాస్త్ర సబ్జెక్టు స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాహెర్‌పాష తెలిపారు. సమావేశానికి జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దిన్, జిల్లా స్టాటిస్టికల్ కో ఆర్డినేటర్ మురళీధర్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో పాఠశాల ఎడ్యు కషన్ యాప్‌లో ఉపాధ్యాయులు సెల్ఫ్, అసెస్మెంట్, విద్యార్థుల మార్కుల నమోదు, బోధించవలసిన పాఠ్యాంశాల పాఠ్య ప్రణాళికలు, ప్రశ్నా పత్రాల తయారీ బోధన అభ్యసన కృత్యాల తయారీ కఠిన అంశాలను ప్రయోగాల ద్వారా వివరణ మొదలగు అంశాలను చర్చించారు. అనంతరం పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన మురళీధర్‌రెడ్డిని పాఠశాల అధ్యాపక బృందం శాలువాతో పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆచారి, శ్రీనివాసులు, సుబ్బయ్య, విజయలక్ష్మి, సూర్యనారాయణ, పద్మ, వహీదు, రజాక్, సత్యనారాయణ, అరవింద్, విక్రమ్, అంజిలాల్, వెంకట్రాజ్, గోపాల్, లక్ష్మి, చంద్రకళ పాల్గొన్నారు.

### మంత్రి జూపల్లిని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే



**వనపర్తి ,డిసెంబర్ 12,ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆహ్వానం మేరకు తిరుమల హిల్స్ లోని వారి నివాసానికి మర్యాదపూర్వకంగా విచ్చేసిన రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీ.జూపల్లి కృష్ణారావు ను ఎమ్మెల్యే.తూడి మేఘారెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావును ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

### జూపల్లి కృష్ణారావుకి స్వాగతం పలికిన జెడ్పిచైర్ పర్సన్ గద్వాల అసెంబ్లీ ఇంచార్జీ సరితమ్మ



**గద్వాల ప్రతినిధి డిసెంబర్ 12 ప్రభాతవార్త:** గద్వాలకు విచ్చేసిన ఎక్సైజ్ , పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకి జోగులాంబ గద్వాల జిల్లా జెడ్పి చైర్ పర్సన్ సరిత అనంతపురం స్టేజి వద్ద గజమాలతో తన అనుచర సైన్యంతో ఘనమైన స్వాగతం పలికారు.

### నూతన ఎమ్మెల్యే శ్రీహరిని సన్మానించిన ఫొటోగ్రాఫర్స్ యూనియన్



**ఉట్కూర్,డిసెంబరు 12 ప్రభాతవార్త:** ఉట్కూర్ మండల అధ్యక్షుడు అశోక్‌చౌదరి ఆధ్వర్యంలో ఉట్కూర్ మండల ఫొటో గ్రాఫర్స్ యూనియన్ రాఘవేంద్ర, రాముశంకర్, జై శ్రీనివాస్, నర్సింలు, శ్రీనివాస్, దాసులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఫొటో గ్రాఫర్ల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. దానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఫొటో గ్రాఫర్ల సమస్యలను పరిష్కరిస్తానని తెలియజేశారు.

### వెంకటాపూర్‌లో శ్రీ ఆంజనేయస్వామి జల్దిబిందె మహోత్సవం



**కోయిల్‌కొండ,డిసెంబరు 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని శేరి వెంకటాపూర్ గ్రామంలో నేడు శ్రీఆంజనేయస్వామి జల్దిబిందె ఉత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ సుందరమ్మ మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నారాయణపేట జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నేతలు అధికసంఖ్యలో రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి..

**దుకాణాలను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్**



**మహబూబ్‌నగర్‌బ్యూరో,డిసెంబరు 12 ప్రభాతవార్త:** మున్సిపాలిటీ పరిధిలో ప్రతి దుకాణదారుడు, యజమానులు వ్యాపార నిర్వ హణకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని జడ్చర్ల మున్సి పల్ కమిషనర్ మొహమూద్ షేక్ తెలిపారు. జడ్చర్ల పురపాలక పరిధిలోని షాపులలో కమిషనర్ మహమూద్ షేక్ మంగళవారం తనిఖీ చేశారు. అలాగే ప్రతి ఒక్క షాపు యజమాని ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని వారం రోజుల్లో పట్టణములోని అందరు ట్రేడ్ లైసెన్స్ తీసుకొని పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న జడ్చర్ల మున్సిపల్ కమిషనర్

# ఓటరు జాబితా తయారుపై కలెక్టర్ సమీక్ష

## ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించే విధంగా చర్యలు తీసుకోవాలి : వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్

**వనపర్తి,డిసెంబర్ 12,ప్రభాతవార్త:** రాబోయే గ్రామ పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలకు ఓటరు జాబితాను తప్పు లు లేకుండా రూపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఐ.డి.ఒ.సి ప్రజావాణి హాల్లో స్పెషల్ సమ్మరి రివిజన్ 2024 పై తహశీ ల్దార్లు, డి.టి లు, బి.యల్.ఒ సూపర్వైజర్లతో ఓటరు జాబితా తయారు పై సమీక్ష నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సంతర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి, 1, 2024 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి చేసిన యువతకు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించాలని, వచ్చిన దరఖాస్తులను మాత్రం చాలా జాగ్రత్తగా పరిశీలించి అర్హులందరికీ ఓటరు జాబితాలో నమోదు అయ్యేవిధంగా చూడాలన్నారు. నమోదు కావచ్చు తొలగింపు లేదా పోలింగ్ స్టేషన్ మార్పు చేర్పులు ప్రతిదీ నిబంధనలు, ఒక పద్ధతి ప్రకారం జరగాలని సూచించారు.


ఓటరు జాబితా తయారు పై సమీక్ష నిర్వహించిన కలెక్టర్

ఓటరు జాబితా తప్పులు లేకుండా సిద్ధం చేసేందుకు తహశీల్దార్లు, బి.ఎల్.ఒ సూపర్వైజర్లు గ్రామాల్లో తిరిగి బి.ఎల్.ఒ లతో కూర్చోని ప్రక్షాళన చేసుకోవాలని సూచించారు. ఎస్.ఎస్.ఆర్ 2024 ప్రకారం డిసెంబర్ 20 నుండి జనవరి 5 వరకు పోలింగ్ స్టేషన్ ల పునర్వ్యవస్థీకరణ, ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలోని తప్పులను గుర్తించి సవరించే ప్రక్రి య చేపట్టాలన్నారు. జనవరి 6న ముసాయిదా జాబితా ప్రచురించాలని, 6వ తేదీ నుండి జనవరి 22 వరకు అభ్యం తరాల స్వీకరణ ఉంటుందన్నారు. ఫిబ్రవరి 2 వరకు అన్ని ఫిర్యాదులు పరిష్కరించి 6వ తేదీన తుది జాబితా ప్రచు రణ కొరకు కమిషన్ కు పంపించాలన్నారు. ఫిబ్రవరి 8వ 2024 న ఓటరు తుది జాబిత ప్రకటించాల్సి ఉంటుందని తెలియజేశారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి యువత ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ యస్. తిరుపతి రావు, తహశీల్దార్లు, డి.టి లు, బి.ఎల్.ఒ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఘన సన్మానం


నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిని సన్మానిస్తున్న భాష పండితులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** నూతనంగా ఎన్నికైన నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బి.విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసులు ఆధ్వర్యంలో పండిత మిత్రులందరు కలిసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా భాషా పండితుల సమస్యలను నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి దృష్టికి తీసుకెళ్లి భాష పండితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. భాష పండితుల సమస్యలకు సానుకూలంగా స్పందిస్తూ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సన్మానించిన వారిలో భాష పండితులు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఇటిక్యాల, డిసెంబరు12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బీచుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనులు జరుగుతున్నందున బుధవారం ఉదయ 8 గం.ల నుండి మధ్యాహ్నం 1 గం.ల వరకు గ్రామాలకు కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని బీచుపల్లి, కొండపేట, యక్తాపురం, ఎర్రవల్లి, కొండేరు, జింకలపల్లి గ్రామాలలో కరెంటు సరఫరాకు అంతరాయం ఉన్నట్లు గ్రామస్తులు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

## పశు వైద్య ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే


గోశాలలో పశు వైద్య ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి, డిసెంబర్12, ప్రభాతవార్త:** వనపర్తి పట్టణ శివారులోని విశ్వక్సేన గోశాలలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి పశువైద్యశాలను ప్రారంభించారు. పట్టణాల్లో తిరుగాడుతూ ప్లాస్టిక్ పేపర్లు భుజిస్తూ ఇబ్బందులు ఎదుర్కొనే గోమాతలకు అత్యాధునిక వైద్య సదుపాయాల అందించేందుకు వనపర్తి విశ్వక్సేన గోశాల నిర్వాహకుడు సావిత్రి రామానుజాచార్యులు ఏర్పాటు చేసిన పశువైద్యశాల ఎంతో స్ఫూర్తిదాయకమని భగవత్ స్వరూపిణిగా చెప్పుకునే గోమాతకు సేవలు చేయడం పూర్వజన్మ సుకృతమని ఎమ్మెల్యే ప్రశంసించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న. విశిష్ట అతిథి వర్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి ఎమ్మెల్యే మేఘ రెడ్డిని ప్రత్యేకంగా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవకు అంకితమైన ప్రతి వ్యక్తి భవిష్యత్తు బాగుంటుందని ప్రజాసేవ ముసుగులో ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడకూడదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సుజాత మధుగౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

- వీలైనంత త్వరగా పరిష్కరించండి : మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి. రవినాయక్
- కోయిల్‌కొండ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 12 ప్రభాతవార్త:** ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నిటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. మంగళవారం ఆయన కోయిల్‌కొండ తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసిల్దార్ కార్యాలయంలోని రికార్డులను, రిజిస్టర్లను తనిఖీ చేయడమే కాకుండా, రికార్డు రూమును, ధరణి పోర్టల్‌ను, మీ సేవ కేంద్రాన్ని


కార్యాలయంలో తనిఖీ నిర్వహిస్తున్న కలెక్టర్ జి. రవినాయక్


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ జి. రవినాయక్

ఆయన తనిఖీ చేశారు. ధరణి పోర్టల్ తనిఖీ సందర్భంగా వివిధ రకాల దరఖాస్తులు పెండింగ్‌లోఉండడాన్ని పరిశీలించిన ఆయన ధరణి ఆపరేటర్‌తో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్ని త్వరగా పరిష్కరించాలని చెప్పారు. మీ సేవ కేంద్రాన్ని తనిఖీచేస్తూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మీ సేవ కేంద్రాన్ని నిర్వహించాలని, కేంద్రాన్ని ఎప్పుడూ మూయవద్దని, మీసేవ నిర్వాకాన్ని ఆదేశించారు అక్కడే ఉన్న ప్రజలతో జిల్లా కలెక్టర్‌మాట్లాడగా ధరణిలో ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉన్నాయా? అని ప్రశ్నించగా తమ భూములు ఇతరుల పేర్లపై ఉన్నాయని, వాటిని తమ పేరుపై మార్చుకునేందుకు వచ్చామని, అవి త్వరగా అయ్యేలా చూడాలని వారు జిల్లా కలెక్టర్‌ను కోరారు. కోయిల్‌కొండ తహసిల్దార్ పి. భరత్‌గౌడ్, డిప్యూటీ తహసిల్దార్‌మురళి, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికరెడ్డి


ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు12 ప్రభాతవార్త:** జాజాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కొరకు ప్రతి ఒక్క డాక్టర్ తప్పకుండా పని చేయాలని నారాయణపేట జిల్లాను ఒక ఉన్నత స్థాయిలో అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంకొరకు ప్రతి ఒక్కరు సహకరించాలని వారువిజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు, గ్రామసర్పంచ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావుకు సన్మానం



**వీపనగండ్ల, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, పురావస్తు, సాంస్కృతి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును జిల్లా మత్స్య పారి శ్రామిక సహకార సంఘం డైరెక్టర్ మేకల సురేంద్రబాబు, తెలంగాణ మత్స్య కారుల సంఘం రాష్ట్ర యువ కార్యదర్శి బొలమెని దర్గేష్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సంక్షేమ పథకాలు చేపడతారని ఆశిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి డైరెక్టర్ బోల మౌని పెంటన్న, మత్స్యకారుల సంఘ సభ్యులు బొలమోని వెంకటస్వామి, మేకల సుబ్రహ్మణ్యం, గుంటి సురేష్, బొలమోని రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి జన్మదినోత్సవం

- అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పది
- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** జన హృదయ నేత, పేదల పెన్నిధి, కరోనా కష్ట కాలంలో దేవుడిలా ఆదుకున్న వ్యక్తి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి జన్మదిన వేడుకలను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి జన్మదిన వేడుకలకు వారి తనయుడు ఎమ్మెలే రాజేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను తండ్రి దామోదర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ప్రజల ఆశాజ్యోతి, ఆపదలో నేను న్నానంటూ భరోసా కల్పిస్తూ నేటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సమకాలిన రాజకీయాలను ఒంట పట్టుకొని ముందుకు సాగుతున్నారని, రాజేష్‌రెడ్డి ఆయురోగ్యారోగాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన పేర్కొన్నారు. దామోదర్‌రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎందరికో ఆదర్శనీయమని, జన హృదయ నేత జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొనడం చాలా అదృష్టకరమన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీలో మరిన్ని పదవులు అధిరోహించాలని కోరారు.

**అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పది : ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి**

రక్తదానం చేయడం వల్ల ప్రాణపాయ నుంచి మనుషులను కాపాడ వచ్చునని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పేర్కొన్నారు. అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి


రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

జన్మదిన వేడుకలను పురస్కరించుకొని రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు 178తో పాటు ఎమ్మెల్యే కూడా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ... అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని, ప్రమాదం జరిగినప్పుడు ప్రాణపాయ స్థితి నుంచి కాపాడటంలో రక్తం చాలా ఉపయోగపడుతుందన్నారు. నియోజకవర్గ ప్రజల్లో ఆధార అభిమానులను చుంగొని, తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారన్నారు. అదే విధంగా ఇక్కడ బాధిత కుటుంబాలకు తాను ఆర్థికంగా సహాయం చేస్తూ ప్రజల హృదయాల్లో గూడుకట్టుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి నాయకుడు ఉండటం నియోజకవర్గ ప్రజల అదృష్టమని, ఇలాంటి నాయకులు నియోజకవర్గంలో ఉంటే పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతారని, ఆయన ఆశయ సాధనలో తాను కూడా పాలు పంచుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు రక్తదాన శిబిరాల్లో పాల్గొని రక్తదానం చేయడం వల్ల రాష్ట్రంలో రక్తం కొరత నివారించవచ్చునన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముందుండే ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి రక్తదాన చేయడం శభ పరిణామమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కె.సుధాకర్‌లాల్, సెక్రటరి రమేష్ రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీధర్, జిల్లా యూత్ కన్వీనర్ కుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యులు కృష్ణారావు తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలను సర్పంచ్‌లుగా గెలిపించుకుంటా

- మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి



**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు12 ప్రభాతవార్త:** రాబోయే పంచాయతీ ఎన్నికల్లో నా కార్యకర్తలను సర్పంచ్‌లుగా గెలిపించుకునే బాధ్యత తనదేనని, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని మరికల్, దామరగిద్ద, ధన్వాడ, కోయిల్ కొండ, నారాయణపేట మండలాలతో పాటునారాయణపేట పట్టణం నుంచి వచ్చిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని పదేళ్లుగా అధికారంలో ఉన్నామని, ఎంతో అభివృద్ధి చేసున్నాం, కానీ ఈసారి ప్రజలు మార్పు కోరుకున్నారన్నారు. ఎన్నికల్లో కొంతమంది తన వెనకాల ఉండితనకు మోసం చేశారని ఇదికూడా ఓటమికి కూడా కారణ మన్నారు. ఓటమి చెందినంత మాత్రాన కార్యకర్తలు ఎవరు కూడా అధైర్య పడవద్దన్నారు. ఇకపై నెలలోరెండుసార్లు సమీక్ష సమావేశంనిర్వహించి పార్టీని మరింత పటిష్టపరుస్తానన్నారు. రాష్ట్ర ప్రజలకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రజాక్షేత్రంలో ఎప్పటికప్పుడు నిలదీస్తామన్నారు.

## మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు



**ఇటిక్యాల, డిసెంబరు12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో అయ్యప్పస్వాములు వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాపడిపూజలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామ్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొంది అయ్యప్పస్వాములకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన రామిరెడ్డి కుమారుడు సోమవారం కర్నూల్ పట్టణంలో ప్రమాదానికి గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామ్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు వల్లూరు గ్రామానికి చేరుకుని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వీరివెంట నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవిప్రకాష్, కృష్ణసాగర్, రాగన్న, లోకారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

## గ్రంథాలయ పీరియడ్‌ను ఖచ్చితంగా నిర్వహించాలి : డీఈఓ అబ్దుల్‌ఘని



**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు 12 ప్రభాతవార్త:** ప్రతి పాఠశాలలో గ్రంథాలయ పీరియడ్‌ను ఖచ్చితంగా నిర్వహించాలని నారాయణపేట జిల్లా విద్యాధికారి అబ్దుల్‌ఘని సూచించారు. మంగళవారం నర్వ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ జాలిఫోనిక్స్ పరిశీలకుల సందర్శనలో భాగంగ పాఠశాలలో గమనించిన అంశాలు ఎఫ్ఎల్ఎన్ ప్రకారము ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల అభ్యసన సాధన పుస్తకాల రాత అంశాలను, జాలిఫోనిక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్శనకు సంబంధించిన సమీక్ష సమావేశాన్ని నర్వ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ డీఈఓ అబ్దుల్‌ఘనీ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ 2.0 ప్రకారము తప్పకుండ బోధన చేసి విద్యార్థుల అభ్యాసన సాధన పుస్తకాలను ఉపాధ్యాయులు మూల్యాంకనం చేసి పిల్లల ప్రగతి మదింపు చేయాలన్నారు. జాలిపోనిక్స్‌ను తప్పనిసరిగా ఒకటి, రెండు తరగతులకు ప్రతి పాఠశాలలో శిక్షణపొందిన ఉపాధ్యాయులుతప్పనిసరిగా బోధించే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా విద్యార్థులలో ధారాళంగా చదవడం అభివృద్ధి చేయాలని సూచించారు. సమావేశంలో మండల విద్యాధికారి వెంకటయ్య ఎంఎన్ఓ రాజేష్, నర్సింలు, డిఆర్పీలు లక్ష్మన్న, శ్రీకాంత్, రాఘవేందర్, జానకి రాములు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.మల్లేష్, సత్యనారాయణరెడ్డి, బీసం శ్రీనివాసులు, శివశంకర్, బలరామ్, వెంకటేష్, ఉస్మాన్, రాజు, రాణి, హరీష్‌కుమార్, ఉస్మాన్ ఖాదర్, సిఆర్పీలు నర్సింహులు, రోజా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అలంపూర్ ఎమ్మెల్యేను కలిసిన షాబాద్ గ్రామ నాయకులు



**ఇటిక్యాల, డిసెంబరు 12 ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గ నూతన ఎమ్మెల్యే విజయుడును మంగళవారం మండల పరిధిలోని శాబాద గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అలంపూర్ జోగులాంబ ఆలయ కమిటి మాజీ ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామ్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే విజయుడును కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫలితాలలో షాబాద గ్రామం నుండి బిఆర్ఎస్ పార్టీకి మంచి మెజార్టీ రావడంతో ఎమ్మెల్యే విజయుడు గ్రామ నాయకులను అభినందించారు.

# తపాల ఉద్యోగుల న్యాయమైన కోరికలను పరిష్కరించాలి

**వెల్దండ, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** తపాల ఉద్యోగుల తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని పోస్టాఫీస్ ఆవరణలో ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ పిలుపుమేరకు గ్రామీణ తపాల ఉద్యోగులు చేపడుతున్న దేశ వ్యాప్త నిరవధిక సమ్మెకు మద్దతుగా వెల్దండ మండల కేంద్రంలోని తపాల కార్యాలయం ముందు ఉద్యోగులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా తపాల ఉద్యోగులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లైన 8 గంటల పని, పెన్షన్ జీడీఎస్ ఉద్యోగులకు, 12, 24, 36 సర్వీస్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ గ్రాటీవీటి రూ.5లక్షలకు పెంచాలని, ఫెడ్ లీవుస్ 180 డేస్ వరకు దాచుకొని వాటిని నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కమలేష్ చంద్ర కమిటీ ఇచ్చిన సిఫారసులను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. చాలా కాలంగా పరిష్కారం చేయకుండా ఉన్న సమస్యలన్నింటిని పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో తపాలా ఉద్యోగుల సమస్యలను చర్చించి కమలేష్‌చంద్ర కమిటీ సిఫారసులను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వెల్దండ తపాలఉద్యోగులు పుష్పగిరి రావు, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, రవీందర్‌రెడ్డి, ఇస్మాయిల్, రతన్, చింటూ, ఆఫ్రీది, భాగ్య తదితరులు ఉన్నారు.


నిరవధిక సమ్మె చేపడుతున్న ఉద్యోగులు

## మిత్ర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నేడు ఉచిత కంటి పరీక్షలు

**వీపనగండ్ల, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** వింత నగర్లో మండల కేంద్రంలో నేరేడు వనపర్తి జిల్లా కంటి వైద్య ఆసుపత్రి బృందంతో వీ గ్రామ ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఆసుపత్రి వైద్యులు తెలియజేశారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని అదేవిధంగా కంటి వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహిస్తామని ఆసుపత్రి యాజమాన్యం తెలియజేశారు. అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలియజేశారు.

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థుల ఎంపిక

**అచ్చంపేట, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ అండర్-14 స్కూల్ గేమ్స్‌లో అచ్చంపేట పాఠశాలకు చెందిన కనిమొల్లి, శ్రీవల్లి, నవీన్ ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరి పాండు తెలిపారు. వాలీబాల్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకొచ్చారన్నారు. మంగళవారం డీఈఓ గోవిందరాజులు విద్యార్థులను అభినందించారు. ఈ నెల 13న నారాయణపేట జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పాండును డీఈఓ గోవిందరాజులు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పాండు, ఎస్పీసీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, వెంకటేశ్వర్ల శెట్టి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్, చక్రపాణి, విద్యార్థులు కనిమొల్లి, శ్రీవల్లి, నవీన్ ఉన్నారు.


విద్యార్థులను, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పాండును సన్మానిస్తున్న డీఈఓ గోవిందరాజులు

## తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె



**ఉట్కూర్, డిసెంబరు 12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె మంగళవారం నిర్వహించారు. ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ పిలుపు మేరకు గ్రామీణ తపాలా ఉద్యోగులు తమసమస్యలను పరిష్కరించాలని ఉట్కూర్ మండల కేంద్ర పోస్టాఫీస్ నందు నిరవదిక సమ్మెకు దిగారు. దీంతో పోస్టాఫీసులో జరిగే లావాదేవీలు ఉత్త రాల బట్వాడా నిలిచిపోయిందని జిడిఎస్ కమిటి సిఫార్సుల మేరకు సీని యర్ జిడిఎస్ ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని ఉద్యోగులపై టార్గెట్ మేళ రూపంలో జిడిఎస్ ఉద్యోగులపై వేదింపులు ఆపాలని కోరారు.

## తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేసిన కలెక్టర్




ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రవినాయక్

**కోయిల్‌కొండ,డిసెంబరు 12 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రవినాయక్ మంగళవారం మండల కేంద్రమైన కోయిల్‌కొండలోని తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ధరణి పోర్టల్ నడుస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటిని వెంటనే పరిష్కరించాలని ధరని ఆపరేటర్‌ను ఆదేశించారు. అనంతరం మీసేవ కేంద్రాన్ని పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు మీ సేవను నడపాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని మీసేవ ఆపరేటర్‌కు సూచించారు. కార్యక్రమంలో మండల తహసిల్దార్‌భరత్‌గౌడ్,డిప్యూటి తహసిల్దార్ మురళి పాల్గొన్నారు.

## పలు ఆలయాల్లో పూజలు

**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు12 ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలోని వివిధ ఆలయాల్లో మంగళవారం నారాయణపేట ఎమ్మెల్యే దంపతులు డా.చిట్టెం పర్ణికరెడ్డి, డా.విశ్వజిత్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నారాయణపేట మండల పరిధి లోని లోకపల్లి లక్ష్మమ్మ దేవాలయం, లింగంపల్లి ఎల్లమ్మ దేవతకు, తిరుమల దేవునిపల్లిలో గల వెంకటేశ్వరస్వామి దేవాలయంలో, ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా ఎమ్మెల్యే ఇంటి ఇలవేల్పు అయిన చిన్న రాజమూరు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నారాయణపేట పట్ట ణంలోని అమరేశ్వర దేవాలయంలో శివలింగానికి అభిషేకంతో పాటు మెట్టుగడ్డ అభయాంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిం చారు. అదేవిధంగా నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని డా.చిట్టెం పర్ణికరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుగంధమ్మ, ఎంపిటిసి శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సదాశివరెడ్డి, కోట్ల జగన్‌మోహన్‌రెడ్డి,బండి వేణుగోపాల్,కోట్ల రవిందర్‌రెడ్డి, ఎండి గౌస్, జనార్ధన్‌గౌడ్, భీమ్‌ప్రకాష్, రాజిరెడ్డి, వెంకటయ్య, కోళ్ల నర్సింలు,నీలిరాములు, బండి గోపాల్‌రెడ్డి, బండి ఆనంద్, కురువ మనోజ్, పవన్,డిఎంహెచ్‌ఓ సౌభాగ్యలక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్‌లో ప్లాస్టిక్ బియ్యం!

### - మిడ్జిల్ మండల కేంద్రంలో ఘటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం పంపిణీ చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటి లాగే రేషన్‌లో బియ్యం తీసుకున్న మిడ్జిల్‌కు చెందిన మాధవి ఇంటికి తీసుకెళ్లింది. మరుసటి రోజు వండి చూడగా అన్నం తింటున్న సమయంలో నోట్లో రబ్బర్‌లాగా రావడం గమనించి చూసింది. వెంటనే అనుమానం వచ్చి కొన్ని బియ్యం తీసుకొని వాటిపై అగ్గిపుల్లతో వెలిగించడంతో కొద్దిసేపు మంట వచ్చింది. దీంతో బియ్యం మొత్తం తీసుకొని వేరుచేసి చూడగా అసలు విషయం బయటికి వచ్చింది. రేషన్ బియ్యంలో ప్లాస్టిక్‌లాగా కనిపించే ఎఫ్‌ఆర్‌కే బియ్యం కలుపుతారని రేషన్‌డీలర్ చెప్పడంతో విషయం తెలిసింది. ఇదే విషయమై కొందరు రేషన్ డీలర్లను విచారించగా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకే రైస్ మిల్లర్లు క్వింటాలుకు ఒక కిలో చొప్పున ఎఫ్‌ఆర్‌కే రైస్‌ను కలుపుతున్నట్లు వెల్లడించారు. ఇందులో విటమిన్స్, మినరల్స్ ఉంటాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.



బియ్యంలో మంటలు వస్తున్న దృశ్యం

## జడ్చర్లలో చోరీ..

### - సీసీ కెమెరాలో హార్డ్ డిస్క్ మాయం..

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్12, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీలోని హౌసింగ్ బోర్డు కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..హౌసింగ్ బోర్డు కాలనీలో సుమలత తన కొడుకుతో కలిసి సొంత ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈక్రమంలో సుమలత కుమారుడు ఉద్యోగరీత్యా వెళ్లగా ఆమె ఒంటరిగా ఉండడం భయపడి తెలిసిన పక్క వారి ఇంట్లో నిద్రించింది. మంగళవారం ఉదయం లేచి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి తులం బంగారం, 30తులాల వెండి , రూ.25వేల వరకు నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. అయితే దొంగలు సీసీ కెమెరాలను దాచి వాటిలోని హార్డ్ డిస్క్‌లను కూడా తీసుకెళ్లారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో పట్టణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అయితే రాత్రి వేళల్లో ఇండ్లకు తాళాలు వేసి వెళ్లరాదని, వెళ్లాల్సి వచ్చినా ఇంట్లో ఎవరినైనా ఉంచాలని పోలీసులు సూచిస్తున్నారు. విలువైన ఆభరణాలు,నగదును ఎట్టిపరిస్థితుల్లోనూ ఇంట్లో ఉంచరాదని పేర్కొన్నారు.

## డాక్టర్ శాంతిప్రియ అజ్మీరాకు అవార్డు



డాక్టర్ శాంతిప్రియ అజ్మీరాను అభినందిస్తున్న పీయూ వీసీ, రిజిస్ట్రార్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్12, ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయం మైక్రోబయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శాంతిప్రియ అజ్మీరాకు అవార్డు రావడంపై పీయూ అధ్యాపక బృందం అభినందించింది. ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 2నుంచి 3వరకు నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ మైక్రోబయాలజిస్ట్ ఆఫ్ ఇండియా వారి 64వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో బెస్ట్ ఓరల్ పేపర్ ప్రెజెంటేషన్ అవార్డు అందుకున్నారు. ఈమేరకు మంగళవారం ఆమెను పీయూ వైస్‌చాన్సలర్ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజామంగతయారు, ఓఎస్‌డీ వీసీ మధుసూదన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

**ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు...**



పీయూ వైస్‌చాన్సలర్ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజామంగతయారు, ఓఎస్‌డీ వీసీ మధుసూదన్‌రెడ్డి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. పాలమూరు విశ్వవిద్యాలయం అభివృద్ధి పనులపై చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు యూనివర్సిటీ అభ్యున్నతికి తన శాయశక్తులా కృషి చేస్తానని, తన పూర్తి సహాయసహకారాలు ఉంటాయని ఆయన తెలిపారు.

# ప్రభుత్వ భూముల జాబితా రూపొందించండి

- ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు పడొద్దు
- ప్రాధాన్య పథకలను కొనసాగించాలి
- సమీక్షలో మహబూబ్‌నగర్ కలెక్టర్ జి. రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 12 ప్రభాతవార్త:** గడిచిన 10, 15 సంవత్సరాలకు సంబంధించి జిల్లాలో ప్రభుత్వ భూముల జాబితాలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధామ్య పథకాలన్నింటిని కొనసాగించాలని, వైద్యం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం ఇంజనీరింగ్ పనులకు సంబంధించి పనులు ఆగిపోకూడదన్నారు. మంగళవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో వివిధ అంశాలపై ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా ప్రాధాన్య పథకాలన్ని కొనసాగాలన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు, విచారణలు, పర్యవేక్షణలు, కొనసాగాలని, విద్య, వైద్యం, ఆరోగ్య, పారిశుద్ద్యానికి సంబంధించిన పనులు సైతం కొనసాగించాలన్నారు. ఇంజనీరింగ్ పనులకు సంబంధించి ఇదివరకు మంజూరై గ్రౌండ్ అయిన పనులను కొనసాగించాలని, పరిపాలన అనుమతులు లేనివి నిలిపివేయాలని అన్నారు. జిల్లాలో 10, 15 సంవత్సరాల కింద అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో ఉన్న ప్రభుత్వ స్థలాలు, భూములు, ఇప్పుడు వాటి పరిస్థితిపై నివేదిక సమర్పించాల్సిందిగా మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ముఖ్యంగా చెరువుల శిఖం భూములు బఫర్ జోన్లలో ఎలాంటి ఆక్రమణలు ఉండరాదని అన్నారు. ప్రభుత్వ స్థలాలు, అందరికి అవసరమయ్యే స్థలాలు, లే అవుట్లు, పంచాయతీ, మున్సిపాలిటీ వారిగా జాబితా రూపొందించి ప్రభుత్వ భూములు ఎలాంటి ఆక్రమణలకు గురి కాలేదని, ఇవన్ని స్థానిక సంస్థల ఆధ్వర్యంలోనే ఉన్నాయని మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులు ధృవీకరించాలని, వచ్చేవారం నాటికి వీటిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ఆయా ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూములపై సైతం వివరాలు సమర్పించాలన్నారు. ఇంజనీరింగ్ పనులపై త్వరలోనే పూర్తిస్థాయిలో సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూడాలని, ధాన్యాన్ని అమ్మిన రైతులకు తక్షణమే డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఓబిఎంఎస్ పెండింగ్‌లో లేకుండా చేయాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించడమే కాక ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. జిల్లాలో ఎరువుల




మాట్లాడుతున్న కలెక్టర్ జి. రవినాయక్, హాజరైన అధికారులు

పరిస్థితిపై ఆయన జిల్లా వ్యవసాయ అధికారి ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆసరా పెన్షన్లకు సంబంధించి భార్యాభర్తల కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిఆర్డీఓ, స్థానిక సంస్థల ఇంఛార్జి అదనపు కలెక్టర్ యాదయ్యను ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అవసరమైన పోలింగ్ సిబ్బంది డేటాను తక్షణమే సేకరించాలని, ఇందుకుగాను డిటిఓ, జిల్లా అధికారుల ద్వారా సమాచారాన్ని సేకరించి సిద్ధం చేయాలని జిల్లాపంచాయతీ అధికారిని ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించిన అందరు నోడల్ అధికారులు, ప్రత్యేక అధికారులు, నోడల్ టీములు రానున్న పార్లమెంట్ ఎన్నికలను సైతం బాగా నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని తెలిపారు. స్థానిక సంస్థల ఇంఛార్జి అదనపు కలెక్టర్, డిఆర్‌డిఓ యాదయ్య, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా అధికారులు సమావేశానికి హాజరయ్యారు.

# వ్యక్తి అదృశ్య ఫిర్యాదుతో బయటపడిన హత్య ఉదంతాలు..

- భూములు, డబ్బులే లక్ష్యంగా వరుస హత్యలు
- హత్యలకు ముందే తన పేరిట ఆస్తుల మార్పిడి
- 11 హత్యలు చేసినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్న నిందితుడు సత్యనారాయణ
- కోర్టు అనుమతితో పోలీస్ కస్టడీకి తీసుకొని మరోసారి విచారిస్తాం
- జోగులాంబ గద్వాల్ జోన్ డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్12 ప్రభాతవార్త:** అతను ఒక తాంత్రికుడు... అతను ఒక నరరూప రాక్షసుడు... అతను ఒక నరహంతకుడు. అమాయకులను గుప్త నిధుల పేరా నమ్మిచి వారి నుంచి అందిన కాడికి దోచుకొని చివరకు హతమార్చడమే అతని టార్గెట్. అమాయకుల స్థిరాస్థులపై అతను కన్ను వేశాడంటే వారి ప్రాణాలు గాల్లో కలిసినట్లే. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డున గల ఇంద్రానగర్ కాలనీకి చెందిన రామటి సత్యనారాయణయాదవ్ అనే వ్యక్తి క్షుద్ర పూజల పేరుతో అమాయకులకు గుప్త నిధులు తవ్విస్తానని నమ్మబలికి ఇప్పటి వరకు 11 హత్యలు చేసినట్లు జోగులాంబ గద్వాల్ జోన్ డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్ వెల్లడించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ ఎస్పీ సీహెచ్. రామేశ్వర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్ మాట్లాడుతూ సత్యనారాయణయాదవ్ అనే వ్యక్తి గత కొన్నేళ్లుగా నాగంకర్నూల్ స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని వారి కుటుంబ నేపథ్యంలో ఉన్న తాంత్రిక పూజలు, ఆకులు, అలుమలతో కూడిన నాటు వైద్యం చేస్తూ జీవనం సాగించేవాడు. ఇతను గత కొన్నేళ్లుగా అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలన్న దుర్బుద్ధితో అమాయకుల నుంచి భూములను నమ్మించి రిజిస్ట్రేషన్ చేసుకొని తదుపరి గుప్త నిధుల పేరా వరుస హత్యలకు పాల్పడినట్లు తమ విచారణలో తేలిందన్నారు. వనపర్తి జిల్లా బొల్లారం గ్రామానికి చెందిన గోవుల వెంకటేష్ రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యం కావడంతో అతని భార్య నాగర్‌కర్నూల్ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సారథ్యంలో పోలీసులు గతంలో ఇక్కడ జరిగిన హత్యలకు వెంకటేష్ హత్యకు దగ్గరి పోలికలు ఉండటంతో ఒక చాలెంజ్‌గా తీసుకొని ఈ కేసును దర్యాప్తు చేయగా సంచలన నిజాలు బయటపడ్డాయన్నారు. 2020లో వనపర్తి జిల్లా నాగపూర్ గ్రామంలో నలుగురిని ఒకే కుటుంబ సభ్యులను హతమార్చిన ఘటనలో సత్యనారాయణ ప్రధాన నిందితుడన్నారు. క్షుద్ర పూజలతో మీ ఇంటి ఆవరణలో బంగారం ఉందని, బయటకు తీస్తానని నమ్మబలికి వారి పేర ఉన్న భూములను తన పేర చేసుకొని తీరా ఒకే కుటుంబంలో నలుగురిని హతమార్చాడన్నారు. నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో జరిగిన ఓ హత్య కేసులు కూడా సత్యనారాయణ ప్రధాన నిందితుడన్నారు. కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన వ్యక్తిని 2021లో మన్ననూరు పరిధిలోని నల్లమల్ల అటవీ ప్రాంతంలో హత్య చేశాడన్నారు.అదే విధంగా 2022లో నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన మరో హత్య కేసులో కూడా ఇతను ప్రధాన నిందితుడని, కల్వకుర్తి ప్రాంతానికి చెందిన మరో వ్యక్తిని సైతం 2023లో హత్య చేశాడని ఆయన వివరించారు. కర్ణాటక రాష్ట్రంలోని బలంగానూర్‌లో 2023 వ్యక్తి హత్య కేసుకు సంబంధించిన కేసులో సైతం ప్రధాన నిందితుడని డీఐజీ తెలిపారు. ఏపీలోని అనంతపురం జిల్లా పెద్దవడుగూరులో జరిగిన వ్యక్తి హత్య కేసులో కూడా సత్యనారాయణ ప్రధాన నిందితుడని వివరించారు. సత్యనారాయణను అదుపులోకి తీసుకొని అతని ఇంటి నుంచి హత్యకు గురైన వ్యక్తులకు సంబంధించిన మొబైల్ ఫోన్లు,10 సిమ్ కార్డులు, హత్యలకు వినియోగించిన టీఎస్31సి3689 నెంబరు గల షిఫ్ట్ డిజైరు కారు, వ్యక్తులను హతమార్చడానికి వినియోగించిన రసాయనాలు, నాటు మందుతో కూడిన జిల్లేడుపాలు, ఇతర విష పదార్ధాలు కలిగి ఉన్న బాటళ్లు, ఐదు ఎలక్ట్రికల్ డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఐజీ వివరించారు. ఇతను ఒంటరిగానే ఒక్కొక్కరిని హతమారుస్తూ ఒక ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు జిల్లాలు, రాష్ట్రాల హద్దులు దాటించి ఎవరికి అనుమానం రాకుండా ఈ వరుస హత్యలకు పాల్పడినట్లు ఆయన వివరించారు. జిల్లేడుపాలు, విష పదార్థాలతో కలిపిన ద్రవాన్ని పాలల్లో కలిపి ప్రసాదంగా క్షుద్రపూజల సమయంలో హతమార్చాలనుకున్న వ్యక్తికి తాపి స్పృహ తప్పిన తర్వాత హత్య చేయడమే ఇతని టెక్నిక్ అన్నారు. కొందరిపై యాసిడ్ పోసినట్లు, మరికొందరిని రాళ్లతోమోదీ చంపినట్లు ఆయన వెల్లడించారు. ఇతనిని అరెస్ట్ చేసిన తర్వాత 11నేరాలను ఒప్పుకున్నాడని, మరిన్ని హత్య చేసి ఉంటాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలోకోర్టులో పీటి వారెంట్ వేసి పోలీస్ కస్టడీకి తీసుకొని మరోమారు విచారిస్తామని డీఐజీ చౌహాన్ తెలిపారు. సత్యనారాయణ అలియాస్ సత్యంయాదవ్ ఇప్పటి వరకు చేసిన హత్యలకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరుగుతుందని, నిందితుడిని కోర్టులో హాజరు పర్చడం జరుగుతుందన్నారు. ఎస్పీ ఆధ్వ ర్యంలో నాగర్‌కర్నూల్ పోలీసులకు సత్యనారాయణకు సంబంధించిన కేసులను శోధిస్తున్నారని, ఇతని అఘాయిత్యాలు ఇంకేమైనా ఉంటే వాటిని కూడా వెలికి తీసి కఠిన శిక్షణ పడేలా చూస్తామన్నారు. నిందితుడిని పట్టుకో వడంలో ప్రధాన భూమికి పోషించిన అధికారులు, పోలీస్ సిబ్బందికి రివార్డు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘు నాథ్, అడిషనల్ ఎస్పీ సీహెచ్ రామేశ్వర్, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి బిట్టు మోహన్‌కుమార్, నాగర్‌కర్నూల్ ఎస్ఐ పి.మహేందర్, ఐడీ పార్టీ పోలీసులు వెంకటేశ్వర్లు,భీముడు,మల్లేష్‌లను డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్ అభినందించారు.



నిందితుడి నుంచి సేకరించిన సామాగ్రి



నిందితుడు ఉపయోగించే విష పదార్థాలు, మాద్రక ద్రవ్యాలు

# కూరగాయలు, పండ్ల ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటుకు కసరత్తు

**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు 12 ప్రభాతవార్త:** జిల్లాలో కూరగాయలు పండ్ల ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నారాయణపేట కలెక్టరేట్‌లోని విడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఉద్యానవన శాఖ, నాబార్డు, రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే తొలిసారిగా నారాయణపేట జిల్లాలో కూరగాయల, పండ్ల ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు గాను జిల్లాలో పది ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు ఉద్యానవన శాఖ అధికారి సాయిబాబా మాట్లాడుతూ ఉద్యాన ఉత్పత్తిదారుల సంఘం తరపున రైతులు బృందంగా ఏర్పడి కూరగాయల, పండ్ల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడి ఇస్తుందని, రైతుల భాగస్వామ్యంతో పాటు నాబార్డు ద్వారా రుణసౌకర్యం కూడా పొందవచ్చని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కొల్లాపూర్ మామిడి పండ్లకు విదేశాల్లో భారీగా డిమాండ్ ఉందని, అదేవిధంగా నారాయణపేట జిల్లాలో కూరగాయల, పండ్ల ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే, మార్కెటింగ్, విదేశాలకు ఎగుమతి చేసేందుకు అవకాశం ఉంటుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా జిల్లాలో కూరగాయల, పండ్ల ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు కోసం అవసరమైన, అనువైన పది ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని వెంటనే గుర్తించాలని, ఆర్డీఓ రామచందర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దామరగిద్ద, మాగనూరుమండలాల పరిధిలో ప్రభుత్వంస్థలాన్ని సేకరించేందుకుఅధికారులు చర్యలు చేపట్టారు.సమావేశంలో జిల్లాఅదనపు కలెక్టర్(రెవెన్యూ)అశోక్‌కుమార్,నాబార్డు అధికారినిచల్, తహసిల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.




అధికారులతో మాట్లాడుతున్న నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

# వైకుంఠధామం శిలాఫలకాన్ని పగులగొట్టిన దుండగులు

### - నసరుల్లాబాద్‌లో ఘటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** గుర్తు తెలియని దుండగులు కొందరు వైకుంఠధామం శిలాఫలకాన్ని పగులగొట్టిన ఘటన జడ్చర్ల మండలంలోని నసరుల్లబాద్‌లో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. నసరుల్లాబాద్‌లో 2020లో జిల్లాలోనే మొదటి వైకుంఠధామాన్ని నిర్మించారు. ఇప్పటివరకు బాగానే ఉన్నా గ్రామంలోని వైకుంఠధామం శిలాఫలకాన్ని కొందరు పగులగొట్టడం చర్చకు దారితీసింది. ఈ విషయమై గ్రామ సర్పంచ్ ప్రణీల్‌చందర్‌ను వివరణ కోరగా కాంగ్రెస్ నాయకులు హింస రాజీకీయాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే దీనిపై సమగ్రవిచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో గ్రామంలో హిందువుల పార్థీవదేహాలను ఖననం చేయడానికి జాగా లేదని, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో రూ.20లక్షలతో చేపట్టిన వైకుంఠధామం నిర్మిస్తే ఓర్వని నాయకులు ఇప్పుడు తమ అధికారం ఉందని ఇలా నీతిమాలిన రాజకీయాలు చేయడం సరికాదన్నారు. గతంలో ఎప్పుడు కూడా ఇలాంటి నీచరాజకీయాలు చేయలేదని గ్రామంలో మేధావులు,నాయకులు ఆలోచించాలని కోరారు. ఇలాంటి చర్యలను సమర్థిస్తే నేడు భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు.



శిలాఫలకాన్ని పగులగొట్టిన దృశ్యం